సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
78932 44734
నంబర్‌ను సంప్రదించండి

మార్కెట్‌కు దసరా శోభ

- కొనుగోలుదారులతో దుకాణాలు కిటకిట
- ముందే మద్యం నిల్వ చేసిన మందుబాబులు
- అదేబాటలో మాంసాహార ప్రియులు


సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద పూజా సామగ్రి కోసం గుమిగూడిన జనం


గోపాలపట్నం మెయిన్ రోడ్డులో రద్దీ


కరాసా బంగారమ్మ, దుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో పూజల్లో మహిళలు

గోపాలపట్నం: మార్కెట్లు దసరా శోభను సంతరించుకున్నాయి. కొనుగోలుదారులతో దుకాణాలు కళకళలాడాయి. వస్త్రాలు, స్వర్ణాభరణాలు, వివిధ మోడళ్ల ద్విచక్ర వాహనాలు అందుబాటులో ఉంచడంతో పాటు ఆఫర్లను ప్రకటించడంతో ఆయా షాపులు కొనుగోలుదారులతో నిండుగా కనిపించాయి. వస్త్ర దుకాణాలు, షాపింగ్ మాళ్లలో వినియోగదారులను ఆకట్టుకునేందుకు నిర్వాహకులు రాయితీలతోపాటు స్పాట్, డ్రా గిఫ్టులు ఏర్పాటు చేశారు. వినియోగదారుల అభిరుచులకనుగుణంగా వస్త్ర వ్యాపారులు వివిధ మోడళ్ల వస్త్రాలను తీసుకొచ్చి ప్రత్యేక రాయితీలతో విక్రయించడంతో షాపులు రద్దీగా మారాయి. మిఠాయిలు విక్రయించే దుకాణాల నిర్వాహకులు కొనుగోలు దార్ల రద్దీని తట్టుకోవడానికి టెంట్‌లు ఏర్పాటు చేసి అదనపు కౌంటర్లను ఏర్పాటు చేశారు. గోపాలపట్నం, ఎన్‌ఏడీ, సింహాచలం రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో దుకాణా ల వద్ద జనం బారులు తీరారు. దసరా పండగను ఘనంగా నిర్వహించుకోవడానికి సిద్ధమయ్యారు.

ముందుగానే పండగ

చాలా ప్రాంతాల్లో ఒక్కరోజు ముందుగానే దసరా సందడి మొదలైంది. అక్టోబర్ 2న గాంధీ జయంతి కావడం, అదేరోజు దసరా రావడంతో మటన్, మందు, చికెన్ షాపులను మూసివేయనున్నారు. దీంతో కొందరు గురువారం కోసం మందు, మటన్, చికెన్ కొనుగోలు చేసి పెట్టుకున్నారు. ఈ కారణంగా మటన్, చికెన్ షాపులముందు జనం బారు లు తీరారు. మద్యం దుకాణాలకు కూడా సెలవు కావడంతో మద్యం ప్రియులు ముందుజాగ్రత్తగా మందు కొనుగోలు చేసి ఉంచుకున్నారు. బుధ వారం ఉదయం నుంచి మద్యం దుకాణాల మందు మందుబాబులు బారులు తీరడం కనిపించింది.

ధరల మోత

దసరా పూజ సామాగ్రి ధరలు కొండెక్కాయి. ఒక్క కొబ్బరికాయ ధర రూ.50 నుంచి రూ.70 పలికింది. డజను అరటిపళ్ల (చిన్న సైజు) రూ.100 దాటిపోయింది. నిమ్మకాయల ధర సైతం అదే విధంగా పెరిగింది. గుప్పెడు మామిడాకుల ధర రూ.20. రెండు పూలు రూ.30 పైమాటే. ఇక మిగిలిన సామగ్రి ధరల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పూల ధర కేజీపై ఒక్కసారిగా రూ.240 పెంచి విక్రయించారు.

హాకర్స్ జోన్ ప్రారంభం ఎప్పుడో?


హాకర్స్ జోన్

మల్కాపురం: తోపుడు బళ్ల వ్యాపారుల కోసం గతంలో హాకర్స్ జోన్ నిర్మించారు. పదేళ్లకు పైగా నిరుపయోగంగానే ఉంచారు.మరలా ఆ షాపులకే మెరుగులు దిద్దారు. పోనీ ఇవైనా వ్యాపారులకు కేటాయించ లేదు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 60వ వార్డు గుల్లపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో 2016లో సుమారు రూ.15 లక్షల వ్యయంతో 32 షాపులను (హాకర్ జోన్)ను అప్పటి జీవీఎంసీ అధికారులు నిర్మించారు. మల్కాపురం నుంచి కోరమాండల్ వరకు రోడ్లపై వ్యాపారాలు చేస్తున్న వారిని ఈ జోన్‌లోకి తరలించి ట్రాఫిక్ ఇక్కట్లకు చెక్ పెట్టాలని యోచించారు. అందులోకి వ్యాపారులను తరలించారు. దీంతో ఈ కేంద్రం ఆకతాయిలకు నిలయంగా మారింది. సమస్యను అధికారులకు పలు మార్లు వివరించడంతో మళ్లీ వినియోగంలోకి తేవాలని నిర్ణయించారు. రూ. 20 లక్షలతో మరమ్మతులు చేసి గ్రిల్స్ బిగించారు. పనులు పూర్తయి దాదాపు 30 రోజులు గడుస్తున్నా నేటికీ వీటిని వ్యాపారులకు కేటాయించ లేదు. దీంతో ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని పలువురు పలు విమర్శిస్తున్నారు.ఇప్పటికైనా స్పందించి వీటిని వ్యాపారులకు కేటాయించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

కామాకులకు ఘన నివాళి


కామాకుల నాగేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: కామాకుల నాగేశ్వరరావుకు పార్టీలకు అతీతంగా పని చేశారని మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. 52వ వార్డు మర్రిపాలెం వుడాలేఅవుట్ రజక వీధిలో బుధవారం ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ కామాకుల నాగేశ్వరరావు మంచి వ్యక్తి అని అన్నారు. ఆయన చనిపోయిన తర్వాత కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో రజక కాలనీ వాసులు, కామాకుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు స్వీట్స్ అందజేత


స్వీట్స్, స్టీల్ బాక్సులు పంపిణీ చేస్తున్న కోరాడ శ్రీను

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పారిశుధ్య కార్మికులకు బుధవారం స్వీట్స్ ,స్టీల్ సామగ్రిని శ్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి కోరాడ శ్రీనివాసరావు పంపిణీ చేశారు. నగర పరిశుభ్రతకు పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ అధికారులు,పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ


వెంకటాపురంలో పింఛన్లు అందిస్తున్న గణబాబు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం ప్రాంతంలోని కంపర పాలెం, నందమూరినగర్ ప్రాంతాల్లో బుధవారం ప్రభుత్వ విప్ గణబాబు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్, వార్డు నాయకులు పాల్గొన్నారు.

ధ్యాన మందిరంలో రెండో రోజూ విశేష పూజలు


శారదామాతకు పూజలు చేస్తున్న భక్తులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ గ్రౌండ్స్ ఎదురుగా ఉన్న షిర్డీ సాయిబాబా ధ్యానమందిరంలో బుధవారం భక్తులు స్వహస్తాలతో కుంజర మహాగణపతి, శ్రీ శారదామాత అమ్మవారికి, శ్రీ నాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మహోత్సవాల్లో భాగంగా కుంకుమపూజలు, సహస్ర నామార్చాన, భక్తుల స్వహస్తాలతో క్షీరాభిషేకం, రుద్రాక్షల అభిషేకం, వస్త్రాలంకరణ, పల్లకీ సేవ, బాబా వారి గీతాలాపన (భజన), పుణ్యాహవచనం, నవగ్రహారాధన, పంచగవ్యం, వాస్తుపూజ, సాయినాథ హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. దసరా పర్వదినం, ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఉదయం నుండి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం మహాన్నదానం అనంతరం బాబా వారి 107వ మహాసమాధి (పుణ్యతిథి) సందర్భంగా భక్తుల స్వహస్తాలతో దీపారాధన జరుగుతాయని, కాశీ హరిద్వార్ నుండి తీసుకొచ్చిన పంచముఖి రుద్రాక్షలను బాబాకు అభిషేకించిన తర్వాత భక్తులకు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. వీటితో పాటు కంకణాలు, సాయిబాబా ఫొటో, షిర్డీ నుండి తీసుకొచ్చిన విభూతి భక్తులకు అందించనున్నట్లు తెలిపారు.

అలరించిన కవి సమ్మేళనం

సీతంపేట : సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. సభాధ్యక్షుడు కె.జి.వేణు మాట్లాడుతూ కవిత్వం, కమనీయ రసాత్మక సాహిత్య ప్రక్రియ అన్నారు. కవి ప్రతిభకు కవితా రీతులు, కవిత్వ పటుత్వం గీటురాళ్లు అన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు కవిత్వ తత్వాన్ని వివరించారు. అనంతరం పలువురు కవులు తమ స్వీయ కవితలను చదివి వినిపించారు. కార్యక్రమంలో భాగవతుల సత్యనారాయణమూర్తి, చల్లా రాంబాబు, సోమంచి వినయభూషణరావు, డి.ఎస్.కుమార్, సీహెచ్ చినసూర్యనారాయణ పాల్గొన్నారు.

శక్తి స్వరూపిణి.. విజయరూపిణి

శక్తి స్వరూపిణి దుర్గామాత. మహర్నవమి వేళ అమ్మ మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. దుష్టశిక్షణ చేసి, శిష్టజనులను రక్షించే జగదంబను భక్తిశ్రద్ధలతో అర్చించారు భక్తులు. శరన్నవరాత్రి మహోత్సవాలతో వాడవాడలా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవార్ల ఆలయాల్లో మహిళలు, మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. విజయాన్ని శుభాన్ని అందించే విజయదశమి పండగను వైభవంగా జరుపుకొనేందుకు నియోజకవర్గవాసులు సర్వం సిద్ధం చేశారు.


మహిషాసురమర్దిని అలంకరణలో దుర్గమ్మ


శాకంబరిగా సాగర కనకదుర్గాదేవి


గాజువాక ఆర్టీసీ డిపో వద్ద జరిగిన పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ తదితరులు


పూజల్లో పాల్గొన్న భక్తులు


భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: దుర్గాదేవి శరన్నవరాత్రుల సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలో ఏర్పాటు చేసిన మండపాల వద్ద కొలువుదీరిన దుర్గాదేవి బుధవారం మహిషాసుమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. గాజువాక ఆర్టీసీ డిపో వద్ద అమ్మవారిని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్, కార్పొరేటర్ లావణ్యలు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే నక్కవానిపాలెంలో ట్రేడ్ యూనియన్ నాయకుడు నక్క లక్ష్మణరావుయాదవ్ పాల్గొని పూజలు జరిపారు.

➠ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి వద్ద డేరింగ్ అండ్ డేషింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఇదే ప్రాంతంలో అల్లరి యూత్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో యూత్ ప్రతినిధులు బొట్ట వెంకటప్పారావుయాదవ్, నమ్మి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

➠ మల్కాపురం పల్లివీధి వద్ద విజయబాలమిత్ర కళా సమితి ఆధ్వర్యంలో దుర్గాదేవికి పూజలు జరిగాయి. మహిళలు వివిధ పిండి వంటలు, స్వీట్లు అమ్మవారికి సారె రూపంలో సమర్పించారు. అనంతరం భవానీ భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించారు.

శాకంబరిగా దుర్గమ్మ

సింధియా: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా యారాడ సాగరి కనకదుర్గాదేవి అమ్మవారు శాకంబరిదేవిగా భక్తులకు దర్శమిచ్చారు. ఎమ్మెల్యే గణబాబు అమ్మవారిని దర్శించుకుని ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రారంభించారు. అదేవిధంగా జనతాకాలనీలో జైదుర్గాదేవిని, బర్మాకాలనీ వనదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జి సోమేష్, కాకి పోలిరెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

బాబోయ్ మద్యం సీసాలు



ఏరిన మద్యం సీసాలతో జేడీ ఫౌండేషన్ సభ్యులు


జీవీఎంసీ వ్యాన్ నిండుగా మద్యం సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు

గోపాలపట్నం: శివారు ప్రాంతాలు మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. చెరువులు, రైల్వే ట్రాక్‌ల వంటి ప్రాంతాల్లో వీరు మద్యం సేవిస్తూ పర్యావరణానికి, ఆయా ప్రాంతవాసులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం నుంచి వెంకటాపురం వెళ్లే రోడ్డులో విచ్చలవిడిగా మద్యం సేవిస్తూ ఇక్కడి చెరువుగట్లపై, చెరువుల్లో, తుప్పల మధ్య సీసాలు, గ్లాసులు వేసేస్తున్నారు. వీటిని గమనించిన జేడీ ఫౌండేషన్ సభ్యులు శానిటరీ సిబ్బంది సహకారంతో వాటిని తొలగించారు. సుమారు అర గంట పాటు సీసాలు ఏరితే జీవీఎంసీ వ్యాన్ నిండిపోయిందని వారు తెలిపారు. 89వ వార్డు శివారుప్రాంతాలపై పోలీసులు నిఘా ఉంచాలని కోరారు. డ్రోన్ల సాయంతో మందుబాబుల ఆగడాలను అరికట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతుబజారులో సెల్‌ఫోన్ దొంగల హల్‌చల్

- మూడు సెల్‌ఫోన్లు చోరీ
- సీసీ ఫుటేజీల పరిశీలన


గోపాలపట్నం రైతుబజారు కార్యాలయంలో సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్న క్రైం పోలీసులు


సెల్‌ఫోన్ చోరీకి పాల్పడుతున్న దొంగలు (నీలం రంగు షర్ట్ వేసుకున్న వ్యక్తి, అతని ముందు ఉన్న మరో యువకుడు)


గోపాలపట్నం రైతు బజారు

గోపాలపట్నం: గోపాలపట్నం రైతు బజారులో 3 సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. దీంతో బాధితులు లబోదిబోమంటూ రైతుబజారు ఎస్టేట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వీరు వెంటనే గోపాలపట్నం క్రైంపోలీసులకు సమాచారమందించారు. బాధితులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గోపాలపట్నం క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రైతుబజా రు ఎస్టేట్ అధికారి కార్యాలయంలో సీసీ ఫుటేజీలను పరిశీ లించారు.

సంచి అడ్డంగా పెట్టి.. : కాయగూరలు కొనుగోలు చేసినట్లుగా వచ్చి సంచి అడ్డంగా పెట్టి చాకచక్యంగా సెల్‌ఫోన్లను చోరీ చేస్తున్నారు. ఇద్దరు వ్యక్తులు ఈ దొంగతనాలు చేస్తున్నట్లు గుర్తించారు. సెల్‌ఫోన్ చోరీ చేసిన తరువాత మరో వ్యక్తికి ఆ ఫోన్ అందించి వెళ్లిపోతున్నాడు. సెల్‌ఫోన్ అందుకున్న వ్యక్తి నెమ్మదిగా స్విచ్ ఆఫ్ చేసేస్తున్నారు. అనంతరం మరో చోటుకు వెళ్లి దొంగతనానికి పాల్పడుతున్నారు. ఇదంతా సీసీ ఫుటేజీలో నమోదైంది. వీటితో పోలీసులు దొంగల్ని పట్టుకునే పనిలో ఉన్నారు.

విలువైన వస్తువులపై జాగ్రత్త వహించాలి

పండగల సమయాల్లో రద్దీగా ఉండే ప్రాంతాల్లో, రైతుబజార్ల వద్ద విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని రైతు బజారు ఈవో ప్రసాద్ సూచించారు. ఎక్కువగా రద్దీగా ఉండే కౌంటర్ల వద్ద దొంగలు పొంచి ఉంటారని, జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. సీసీ కెమెరాల్లో దొంగలను గుర్తించి, పోలీసులకు అప్పగిస్తున్నా కొత్త వ్యక్తులు వస్తున్నందున ఎవరికి వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. దీనిపై ప్రతీరోజు మైకులో వినియోగదారులకు హెచ్చరికలు చేస్తున్నామని తెలిపారు.

నిఘా లేక..

గతంలో నేర విభాగం పోలీసుల నిఘా ఉండేదని, ప్రస్తుతం కొన్నేళ్లుగా నిఘా కరువైందని పలువురు తెలిపారు. పోలీసులు యూనిఫాంలో ఉండటం వల్ల దొంగతనాలకు పాల్పడేందుకు సాహసించరని భావిస్తున్నారు. రైతు బజార్లలో రద్దీ సమయాల్లో పోలీసుల నిఘా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని పలువురు వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అదానీ సంస్థలపై ఇంత ప్రేమెందుకు?

ఏపీ ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు జేటీ రామారావు సూటి ప్రశ్న


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మహారాణిపేట: విశాఖలో అదానీ గ్రూపునకు చెందిన అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌ని రద్దు చేయాలని, ప్రజాభిప్రాయ సేకరణను వెంటనే నిలిపేయాలని ఏపీ ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు జేటీ రామారావు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గుజరాత్, హర్యానా, తెలంగాణలో అదానీ గ్రూపు సిమెంట్ పరిశ్రమలు మూతపడుతున్నా ఏపీలో మాత్రం పోలీస్ పహారాలో జనావాసాల మధ్య ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. కేవలం గుజరాత్ ప్రభుత్వానికి ఉన్న అనుమతులను బూచిగా చూపి ఏపీలో పరిశ్రమలు పెట్టడానికి ఏ రకంగా ముందుకు వస్తారని రామారావు అన్నారు. క్లింకర్, జిప్సం, ఫ్లైయాష్, స్లాగ్, బొగ్గు వంటి వ్యర్థాలు విడుదలవుతాయని అన్నారు. ఎస్‌వో2 వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. అలాగే కార్బన్, ఇతర వస్తువుల వల్ల భూగర్భ జలాలు దెబ్బతింటున్నాయన్నారు. రైతులు, మత్స్యకారులు గంగవరం పోర్టు కోసం భూములిచ్చారే గానీ సిమెంట్ పరిశ్రమ కోసం కాదన్నారు. గుజరాత్ ప్రభుత్వం అనుమతులతో ఈ ప్రాజెక్ట్ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కె. రామచంద్ర మూర్తి, ఆర్. తాతారావు, బి. నీలకంఠం, ఎస్. జగదీష్, వద్దాది శివ, జి. సుమతి, బి. రాంబాబు, జె. ఫణి ప్రియాంక, కె. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం


వాక్‌థాన్‌లో పాల్గొన్న అధికారులు

తాటిచెట్లపాలెం: ఉద్యోగులు, ప్రయాణికులు, ప్రజల్లో స్వచ్ఛతా ఉద్యమంపై అవగాహన కల్పించేందుకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ సహకారంతో వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్‌బొహ్రా నాయకత్వంలో వాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించారు. రైల్వే ఇండోర్ స్టేడియం నుండి డీఆర్‌ఎం కార్యాలయం మీదుగా రైల్వే స్టేషన్ వరకు ఈ వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛత అనేది కేవలం బాహ్య శుభ్రత మాత్రమే కాదని, దీనిని ఒక అలవాటుగా చేసుకుని ఆరోగ్యకరంగా జీవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహూ (ఆపరేషన్స్), ఈ. శాంతారాం (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్), సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ ప్రవీణ్ భటి, ఎం. హరనాథ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.







